హమాస్ చీఫ్ సిన్వార్ హతం

- ఇజ్రాయెల్ దాడిలో మృతి
- ధ్రువీకరించిన ఐడీఎఫ్
- డీఎన్ఏ పరీక్షతో నిర్ధారణ
- ఇజ్రాయెల్‌పై అక్టోబర్ 7 దాడులకు సూత్రధారి ఆయనే
- మృతిపై స్పందించని హమాస్

జెరూసలేం, అక్టోబర్ 17: ఇజ్రాయెల్‌తో పోరులో హమాస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇజ్రాయెల్ దాడిలో సంస్థ చీఫ్ యహ్యా సిన్వార్ మృతిచెందారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ధ్రువీకరించింది. గాజాలోని రఫా పట్టణంపై ఐడీఎఫ్ ఈ నెల 7న చేసిన దాడిలో సిన్వార్ హతమైనట్టు ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ మంత్రి కట్జ్ గురువారం నిర్ధారించారు. ఇది ఇజ్రాయెల్‌కు గొప్ప సైనిక, నైతిక విజయం.. అని ఆయన పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ప్రకటనపై హమాస్ స్పందించలేదు. 'ఏడాది క్రితం అక్టోబర్ 7న యహ్యా సిన్వార్ నేతృత్వంలో ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన భయంకర ఊచకోతలో 1200 మంది ఇజ్రాయెల్ పౌరులు కన్నుమూశారు. వారిలో మహిళలు, చిన్నారులు, వృద్ధులు కూడా ఉన్నారు. ఒక ఏడాది తర్వాత సిన్వార్‌ను ఇజ్రాయెల్ దళాలు మట్టుబెట్టాయి. న్యాయం జరిగింది. ఇజ్రాయెల్ వాసులకు హాని కలిగించే ఏ ఉగ్రవాది అయినా శిక్ష అనుభవించాల్సిందే' అని ఇజ్రాయెల్ అధికారిక సందేశాన్ని పోస్ట్ చేసింది.

ఎప్పుడు జరిగింది?

ఇజ్రాయెల్ పదాతి దళాలు దక్షిణ గాజా స్ట్రిప్‌లోని రఫా నగరంలో ఈ నెల 7న ఆపరేషన్ నిర్వహించి ముగ్గురు ఉగ్రవాదులను చంపాయి. తర్వాత ఆ ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయి. అందులో ఒకరి మృత దేహం సిన్వార్‌దిగా అనుమానం రావడంతో ఆ మృత దేహానికి డీఎన్ఏ పరీక్షలు చేస్తామని, గతంలో సిన్వార్ ఇజ్రాయెల్ జైలులో ఉన్నప్పుడు అతని నుంచి తీసిన డీఎన్ఏ శాంపిల్స్‌తో దీనిని పోలుస్తామని ఇజ్రాయెల్ ఆర్మీ రేడియో ప్రకటించింది. అయితే తర్వాత ఆ మృత దేహం అతడిదే అని డీఎన్ఏ పరీక్షతో నిర్ధారణ అయ్యింది.

అక్టోబర్ 7 దాడులకు సూత్రధారి

గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడిలో సిన్వార్ ప్రధాన వ్యూహకర్తగా వ్యవహరించారు. అప్పటి నుంచి ఇజ్రాయెల్ వాంటెడ్ లిస్టులో ఉన్న సిన్వార్ జాడను కనిపెట్టడం ఇజ్రాయెల్‌కు కష్టతరంగా మారింది. గాజాలో నిర్మించిన సొరంగాల్లో ఆయన ఎక్కువగా ఉండేవారు. ఇదే క్రమంలో అప్పటివరకు హమాస్ చీఫ్‌గా ఉన్న ఇస్మాయిల్ హనియా ఇరాన్‌లోని టెహ్రాన్‌లో ఉండగా, ఆగస్టులో ఇజ్రాయెల్ మట్టుబెట్టడంతో ఆయన స్థానాన్ని సిన్వార్ స్వీకరించారు. తర్వాత కొన్ని రోజులకు హెజ్బొల్లా చీఫ్ నస్రల్లాను సైతం ఇజ్రాయెల్ హతమార్చడంతో సిన్వార్‌కు భయం పట్టుకున్నది. దీంతో తన ఆచూకీని ఇజ్రాయెల్ ఎక్కడ కనిపెడుతుందో అన్న భయంతో ఆయన కనీసం మధ్యవర్తిగా ఉన్న ఖతార్‌తో సైతం ఫోన్‌లో మాట్లాడటానికి కూడా ఇష్టపడలేదని, ఇజ్రాయెల్ బందీలను తనకు రక్షణ కవచంగా ఉంచుకుంటున్నారని వార్తలొచ్చాయి.

ఎవరీ సిన్వార్?

1962లో జన్మించిన సిన్వార్ గాజాలోని ఇస్లామిక్ యూనివర్సిటీ ఆందోళనల్లో పాల్గొనడంతో ఇజ్రాయెల్ 1980లో అరెస్ట్ చేసింది. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఇజ్రాయెల్‌పై పోరాటానికి ఆయుధాల ప్రయోగంలో శిక్షణ పొందిన వారిని నియమించి ఒక సంస్థను స్థాపించాడు. కాసమ్ బ్రిగేడ్స్‌గా పేరొందిన ఆ గ్రూప్ తర్వాత హమాస్ మిలటరీ వింగ్‌గా మారింది. అనంతరం అతడిని అరెస్ట్ చేసిన ఇజ్రాయెల్ 426 ఏండ్ల జైలు శిక్ష విధించింది. 23 ఏండ్లు అతను ఇజ్రాయెల్ జైలులో గడిపాడు. 2011లో ఖైదీల ఒప్పందంతో విడుదలయ్యాడు. 2014లో హమాస్‌లో ప్రధాన నేతగా ఎదిగాడు. గత ఏడాది అక్టోబర్ 7 దాడిలో ప్రధాన పాత్ర పోషించాడు.

కొరియాలో యుద్ధమేఘాలు

- యుద్ధ సన్నాహాల్లో ఉత్తర కొరియా
- ఆర్మీలో లక్షలాదిగా నియామకాలు
- దక్షిణ కొరియాను శత్రు దేశంగా పేర్కొంటూ రాజ్యాంగంలో మార్పు
- ఇరు దేశాలను కలిపే రోడ్లు ధ్వంసం
- అణుబాంబు తయారీ దిశగా దక్షిణ కొరియా?

కిమ్ జోంగ్ ఉన్

సియోల్, అక్టోబర్ 17: కొరియా ద్వీపకల్పంలో యుద్ధమేఘాలు అలుముకుంటున్నాయి. ఉత్తర కొరియా, దక్షిణ కొరియా మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. దక్షిణ కొరియాపై పూర్తి స్థాయి యుద్ధానికి దిగేందుకు ఉత్తర కొరియా సిద్ధమవుతున్నదనే వార్తలు వస్తున్నాయి. గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలు ఈ వార్తలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. దక్షిణ కొరియా సైతం ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నదని తెలుస్తున్నది. ఇప్పటికే ఒకవైపు రష్యా – ఉక్రెయిన్ యుద్ధం, మరోవైపు మధ్యప్రాచ్యంలో ఇజ్రాయెల్ – లెబనాన్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు కొరియాలోనూ యుద్ధం ముంచుకొచ్చే పరిస్థితులు కనిపిస్తుండటం ఆందోళనకరంగా మారింది. ముఖ్యంగా ఉత్తర కొరియాకు చైనా, రష్యాతో సంబంధాలు ఉండటం, దక్షిణ కొరియాకు అమెరికా మద్దతు ఉండటంతో ఇరు కొరియా దేశాల మధ్య యుద్ధం తలెత్తితే పర్యవసానాలు తీవ్రంగా ఉండే ప్రమాదం ఉంది.

దక్షిణ కొరియాను కలిపే సరిహద్దు రోడ్లను ఇటీవల పేల్చేసిన ఉత్తర కొరియా

యుద్ధ సన్నాహాల్లో ఉత్తర కొరియా!

ఉత్తర కొరియాను ఆ దేశాధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ యుద్ధానికి సిద్ధం చేస్తున్నట్టు కనిపిస్తున్నది. గత వారం రోజుల్లో 14 లక్షల మంది యువత తమ ఆర్మీలో చేరారని ఆ దేశం ప్రకటించింది. రెండు రోజుల్లోనే 10 లక్షల మంది స్వచ్ఛందంగానే సైన్యంలో చేరారని చెప్పింది. దీనికి సంబంధించిన చిత్రాలను ఆ దేశ మీడియా విడుదల కూడా చేసింది. మరోవైపు దక్షిణ కొరియాను శత్రుదేశంగా పేర్కొంటూ ఏకంగా రాజ్యాంగ సవరణ చేసింది. 'ఉత్తర కొరియా రాజ్యాంగ అవసరాలకు అనుగుణంగా, అనివార్యమైన, చట్టబద్ధమైన చర్య ఇది' అంటూ కిమ్ ప్రభుత్వం తన చర్యలను సమర్థించుకుంది. దక్షిణ కొరియాను ప్రధాన శత్రువుగా ఈ ఏడాది జనవరిలో కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించగా, ఇందుకు అనుగుణంగా ఇప్పుడు రాజ్యాంగ సవరణ చేశారు. ఇరు దేశాలను కలిపే రోడ్డు, రైలు మార్గాలను సైతం ఉత్తర కొరియా పేల్చేస్తున్నది. అణ్వాయుధాల్లో కీలకమైన యురేనియం ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని సైతం గత నెల అధికారులకు కిమ్ ఆదేశాలు ఇచ్చారు. అణ్వాయుధ సంపత్తిని పెంచాలని ఆయన సూచించారు.

సైన్యంలో చేరేందుకు పేర్లు నమోదు చేసుకుంటున్న ఉత్తర కొరియా యువకులు

ఏడు దశాబ్దాలుగా ఉద్రిక్తతలే

ఇరు కొరియా దేశాల మధ్య ఏడు దశాబ్దాలుగా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. 1910 నుంచి 1945 వరకు జపాన్ ఆధీనంలో ఉమ్మడి కొరియా ఉండేది. 1945లో రెండుగా విడిపోయి సోవియెట్, చైనా కమ్యూనిస్టుల సాయంతో ఉత్తర కొరియా, అమెరికా మద్దతుతో దక్షిణ కొరియా ఏర్పడ్డాయి. 1950లో దక్షిణ కొరియాపై ఉత్తర కొరియా యుద్ధానికి దిగగా, దక్షిణ కొరియాకు అమెరికా మద్దతు ఇచ్చింది. మూడేండ్ల పాటు యుద్ధం కొనసాగిన అనంతరం ఇరు దేశాల మధ్య స్పష్టమైన భౌగోళిక విభజన జరిగింది. ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం మాత్రం జరగలేదు. తర్వాత తరచూ ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇవి మరింత పెరిగాయి. ఇంతకాలం ఇరు దేశాలను కలపాలని భావించిన కిమ్ జోంగ్ ఉన్.. తన అభిప్రాయాన్ని మార్చుకున్నట్టు, రెండు దేశాలు కలిసే ప్రసక్తే లేదని ప్రకటించారు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొత్త కాకపోయినా ప్రస్తుత పరిణామాలు 1950 నాటి యుద్ధ పరిస్థితులను గుర్తు చేస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, తన పాలనపై విధేయతను దృఢపరుచుకునేందుకు ఉద్రిక్తతలను పెంచడం కూడా కిమ్ జోంగ్ ఉన్‌కు అలవాటేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అణుబాంబు తయారీ దిశగా దక్షిణ కొరియా?

ఉత్తర కొరియా యుద్ధ సన్నాహాల్లో ఉండటంతో యుద్ధం తలెత్తినా ఎదుర్కొనేందుకు దక్షిణ కొరియా సిద్ధమవుతున్నది. ఉత్తర కొరియా అణ్వాయుధాలపై ఆందోళన చెందుతున్న దక్షిణ కొరియా సైతం అణుబాంబుల తయారీ దిశగా అడుగులు వేస్తున్నది. అణు ఇంధనాన్ని రీప్రాసెస్ చేయటం కోసం అమెరికా సాయం పొందేందుకు దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దౌత్య ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు వార్తలు వెలువడుతున్నాయి. రీప్రాసెస్ చేసిన అణు ఇంధనంతో అణు బాంబు తయారుచేయాలన్నదే దక్షిణ కొరియా ఆలోచనగా యుద్ధ నిపుణులు పేర్కొన్నారు. అంతా అనుకున్నట్టు జరిగితే దక్షిణ కొరియా మూడు నుంచి ఆరు నెలల్లో అణు బాంబును సిద్ధం చేస్తుందని అంచనా వేస్తున్నారు.

యూన్ సుక్ యోల్

మా మాటే రుజువైంది

నిజ్జర్ కేసులో ఆధారాలు లేవన్న ట్రూడో వ్యాఖ్యలపై భారత్ స్పందన

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో వైఖరిపై భారత్ కీలక వ్యాఖ్యలు చేసింది. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత ఏజెంట్ల ప్రమేయంపై నిఘా ఊహాగానాలే తప్ప బలమైన ఆధారాలు లేవని కెనడా పార్లమెంటరీ విచారణ కమిషన్ ముందు ట్రూడో అంగీకరించిన సంగతి తెలిసిందే. ఈ విషయమై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పందించారు. 'భారత్‌పై, భారత దౌత్యవేత్తలపై కెనడా చేసిన తీవ్రమైన ఆరోపణలను బలపరిచే ఆధారాలేవీ కెనడా మాకు సమర్పించలేదని మేం చాలా రోజులుగా చెప్తున్నదే ఇవాళ రుజువైంది. భారత్ – కెనడా సంబంధాలు దెబ్బతినడానికి కెనడా ప్రధాని ట్రూడో వైఖరే కారణం' అని ఆయన పేర్కొన్నారు.

బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులను కెనడా అప్పగించలేదు

నిజ్జర్ హత్యలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పాత్ర ఉందని ట్రూడో చేసిన ఆరోపణలపై రణ్‌ధీర్ జైస్వాల్ స్పందించారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్, అతడి సంబంధాల గురించి తాము కొన్నేండ్ల క్రితమే కెనడాకు చెప్పామని, వారిని అరెస్టు చేసి, అప్పగించాలని కోరామని తెలిపారు. ఇటీవల కూడా మరోసారి కోరామని, అయినా కెనడా స్పందించలేదని పేర్కొన్నారు. భారత దౌత్యవేత్తలు కెనడియన్ల సమాచారాన్ని సేకరించి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చేరవేశారని ఇటీవల ట్రూడో ఆరోపించిన సంగతి తెలిసిందే.

పిల్లలు కనకుండా నిరుత్సాహపరిస్తే 42 లక్షల జరిమానా

బిల్లును ఆమోదించిన రష్యా

మాస్కో, అక్టోబర్ 17: పిల్లలను కనకుండా ప్రజలను నిరుత్సాహపరిచే వారిపై కఠిన చర్యలను తీసుకునేందుకు రష్యా సిద్ధమైంది. ఇలాంటి వారికి భారీగా జరిమానా విధించే బిల్లుకు రష్యా దిగువ సభ గురువారం ఆమోదం తెలిపింది. ఉక్రెయిన్‌తో పోరాటం, దేశంలో జననాల సంఖ్య తగ్గిన క్రమంలో ఈ బిల్లు ప్రవేశపెట్టినట్టు సభ్యులు తెలిపారు. ఈ బిల్లు అధ్యక్షుడు పుతిన్‌కు తుది ఆమోదానికి పంపే ముందు స్టేట్ డుమా, ఎగువ సభల్లో ఆమోదం పొందాల్సి ఉంది. ఈ చట్టం ప్రకారం.. పిల్లలు కనకుండా ప్రోత్సహించే ప్రచారాన్ని వ్యాప్తి చేయడం నేరంగా పరిగణిస్తారు. దీనికి సుమారు రూ.42 లక్షలు జరిమానా విధిస్తారు.

నవంబర్ 26న దేశవ్యాప్త నిరసనలు

500 జిల్లాల్లో చేపడతాం: ఎస్‌కేఎం

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: కేంద్రంలో మోదీ సర్కార్ తీరును నిరసిస్తూ నవంబర్ 26న దేశవ్యాప్తంగా ఆందోళనలు, ర్యాలీలు చేపడుతున్నట్టు రైతు సంఘాల ఐక్య వేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) తెలిపింది. 'ఢిల్లీ మార్చ్' పేరుతో రైతులు చేపట్టిన నిరసనలకు నాలుగేండ్లు అయిన సందర్భంగా వచ్చే నెల 26న దేశంలోని 500 జిల్లాల్లో ఆందోళనలు చేపడుతున్నామని తాజాగా ప్రకటించింది. ఏఐకేఎస్ నాయకుడు హన్నన్ మొల్లా విలేకర్లతో మాట్లాడుతూ, 'రైతులకు ఇచ్చిన వాగ్దానాలను కేంద్రం నెరవేర్చలేదు. రైతులను మోసం చేసింది. దీంతో మేం దేశమంతా ఆందోళనకు సిద్ధమవుతున్నాం' అని అన్నారు. కేంద్రం ఇలాగే వ్యవహరిస్తే వచ్చే ఏడాది రైతులు తమ ఆందోళనల్ని మరింత ఉధృతం చేస్తారని క్రాంతికారి కిసాన్ యూనియన్ అధ్యక్షుడు దర్శన్‌పాల్ అన్నారు.

కల్తీ మద్యానికి 24 మంది బలి

బీహార్‌లో దారుణం

సివాన్, సారణ్, అక్టోబర్ 17: బీహార్‌లోని సివాన్, సారణ్ జిల్లాల్లో కల్తీ మద్యం తాగి 24 మంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు గురువారం వెల్లడించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం నితీశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రాణాపాయ స్థితిలో ఉన్న మరో 25 మందికి పైగా వ్యక్తులు దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. మద్యపానం, మద్యం అమ్మకాలపై నిషేధం విధించినందుకు వచ్చిన ప్రయోజనం ఏమిటని ప్రభుత్వాన్ని విపక్షాలు ప్రశ్నించాయి. సీఎం, హోం శాఖ వైఫల్యమే ఇందుకు కారణమని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రశ్నించారు.

జేఈఈ మెయిన్‌లో ఇక ఆప్షనల్ ప్రశ్నలు ఉండవు

ప్రకటించిన ఎన్‌టీఏ

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: జేఈఈ మెయిన్ పరీక్ష విధానంలో కీలక మార్పు చేస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) గురువారం ప్రకటించింది. ఇక నుంచి సెక్షన్ బీలో ఆప్షనల్ ప్రశ్నలు ఉండవని పేర్కొన్నది. కొవిడ్ సమయంలో విద్యార్థులు పరీక్షకు సన్నద్ధం కావడంలో కలిగిన ఆటంకాల నేపథ్యంలో 2021 జేఈఈ(మెయిన్) పరీక్షలో ఎన్‌టీఏ మార్పు చేసింది. సెక్షన్ బీలో 10 ప్రశ్నలు ఇచ్చి, ఐదు ప్రశ్నలకు సమాధానాలు రాయాలని విద్యార్థులకు ఆప్షన్ ఇచ్చింది. 2024 జేఈఈ(మెయిన్) వరకు ఈ విధానాన్ని కొనసాగించింది. 2025 జేఈఈ(మెయిన్) పరీక్ష నుంచి మాత్రం ఆప్షనల్ ప్రశ్నలు ఉండవని, 2021కు ముందు ఉన్న పద్ధతిలోనే పరీక్ష ఉంటుందని ఎన్‌టీఏ ప్రకటించింది. సెక్షన్ బీలో ఐదు ప్రశ్నలే ఇవ్వనున్నట్టు, ఈ ఐదు ప్రశ్నలకూ సమాధానాలు రాయాల్సి ఉంటుందని తెలిపింది. కొవిడ్ ముగిసినందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది.

60 రోజులకే అడ్వాన్స్ బుకింగ్

- నవంబరు 1 నుంచి అమలు
- రైల్వే బోర్డు కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: రైలు టికెట్ల అడ్వాన్స్ బుకింగ్‌ను 120 రోజుల నుంచి 60 రోజులకు కుదిస్తూ రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుంది. నవంబరు 1 నుంచి ఇది అమలులోకి వస్తుందని గురువారం ప్రకటించింది. అంటే, 60 రోజుల లోపు ప్రయాణానికే రైలు టికెట్‌ను ముందుగా బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది. అక్టోబరు 31 వరకు చేసుకున్న అన్ని బుకింగ్‌లు 120 రోజుల వరకు కొనసాగుతాయని రైల్వే స్పష్టతనిచ్చింది. కాగా, గతంలో రైల్వే టికెట్లు అడ్వాన్స్ బుకింగ్ 60 రోజులే ఉండేది. 2015 మార్చి 25న దీనిని 120 రోజులకు పెంచారు. 120 రోజుల అడ్వాన్స్ బుకింగ్ వల్ల క్యాన్సలేషన్‌లు ఎక్కువ అవుతున్నాయని, ప్రయాణాలు రద్దు చేసుకోవడం వల్ల బెర్త్‌లు వృథా అవుతున్నాయని రైల్వే బోర్డు తెలిపింది. ప్రస్తుతం అడ్వాన్స్ బుకింగ్‌లో 21 శాతం రద్దు అవుతున్నాయని, 4–5 శాతం మంది ప్రయాణికులు ప్రయాణాలు చేసుకుంటున్నప్పటికీ టికెట్లు క్యాన్సల్ చేసుకోవడం లేదని పేర్కొన్నది. అసలైన ప్రయాణికులకు టికెట్లు లభించే అవకాశాలను పెంచేందుకు గడువును తగ్గించినట్టు తెలిపింది. అడ్వాన్స్ బుకింగ్‌కు తక్కువ కాల పరిమితి ఉండే తాజ్ ఎక్స్‌ప్రెస్, గోమతి ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్ల బుకింగ్‌లో మార్పు లేదని రైల్వే బోర్డు పేర్కొన్నది. విదేశీయులు 365 రోజుల ముందు రైలు టికెట్లు బుక్ చేసుకునే విధానంలోనూ మార్పు లేదని తెలిపింది.

యూజీసీ నెట్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు ఎదురుచూస్తున్న యూజీసీ నెట్ (జూన్) 2024 ఫలితాలు విడుదలయ్యాయి. ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 5 వరకు మొత్తం 83 సబ్జెక్టులకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలను ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) గురువారం ప్రకటించింది. అక్టోబర్ 10న ఫైనల్ కీ విడుదల చేసిన అధికారులు, తాజాగా స్కోర్ కార్డులను తమ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు ఈ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ స్కోర్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

హర్యానా సీఎంగా సైనీ ప్రమాణం

హాజరైన ప్రధాని మోదీ, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు

చండీగఢ్, అక్టోబర్ 17: హర్యానా ముఖ్యమంత్రిగా వరుసగా రెండోసారి ఓబీసీ నేత నాయబ్ సింగ్ సైనీ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. వాల్మీకి జయంతి రోజున పంచకులలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయబ్ సింగ్, కొందరు మంత్రులతో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. ముఖ్యమంత్రి హిందీలో, మిగిలిన వారు ఇంగ్లిష్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, గడ్కరీ, జేపీ నడ్డా, చిరాగ్ పాశ్వాన్‌తో పాటు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు ఎన్డీఏ నేతలు పాల్గొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో హర్యానాను శరవేగంగా ముందుకు తీసుకువెళ్లేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ తెలిపారు.

ఫెమీనా మిస్ ఇండియా వరల్డ్‌గా నిఖితా పోర్వాల్

ముంబై: ఫెమీనా మిస్ ఇండియా వరల్డ్ 2024 పోటీల్లో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి చెందిన నిఖితా పోర్వాల్ విజేతగా నిలిచి కిరీటం దక్కించుకుంది. దాద్రా అండ్ నాగర్ హవేలికి చెందిన రేఖా పాండే, గుజరాత్‌కు చెందిన ఆయుషి ధోలకియా వరసగా ఫస్ట్, సెకండ్ రన్నరప్‌లుగా నిలిచారు. ఈ పోటీలో నిఖిత ఫ్యాషన్, టాలెంట్, వ్యక్తిత్వ ఆధారిత రౌండ్లలో మెరుగైన ప్రదర్శన కనబరిచి మొత్తం 30 మందిని వెనక్కి నెట్టి కిరీటాన్ని దక్కించుకుంది. ఫెమీనా మిస్ ఇండియాగా నిలవడంపై నిఖిత మాట్లాడుతూ.. ఆ అనుభూతిని వర్ణించలేనని పేర్కొంది. విజేతగా నిలవడానికి ముందు తాను అనుభవించిన టెన్షన్ ఇప్పటికీ అలాగే ఉందని తెలిపింది. తన ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైందని, సాధించాల్సింది ఇంకా ఎంతో ఉందని చెప్పింది. మిస్ ఇండియాగా ఎంపికైన నిఖిత మిస్ వరల్డ్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనుంది.

ఆగని ఉద్యోగాల కోతలు

- మెటాలో భారీగా తొలగింపులు
- ఇంటెల్‌లో 2 వేల మందిపై వేటు
- నోకియాలో 2,350 మందికి ఉద్వాసన



న్యూఢిల్లీ, అక్టోబర్ 17: సోషల్ మీడియా దిగ్గజ సంస్థ మెటా.. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ సహా వివిధ టీమ్‌ల నుంచి పలువురు ఉద్యోగులను తొలగించినట్టు గురువారం కొన్ని నివేదికలు వెల్లడించాయి. కంపెనీ పునర్నిర్మాణంలో భాగంగా ఈ కోతలు చేపట్టినట్టు తెలుస్తున్నది. అయితే తాజాగా ఎంతమంది ఉద్యోగులను తొలగించారనే విషయాన్ని మెటా వెంటనే వెల్లడించలేదు. ఈ కోతల వల్ల కంపెనీలోని వివిధ టీమ్‌లు ప్రభావితమవుతాయని టెక్ క్రంచ్ నివేదిక తెలిపింది. దీర్ఘకాల వ్యూహాత్మక లక్ష్యాల కోసం కొన్ని టీముల్లో మార్పులు చేస్తున్నట్టు మెటా అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఉద్యోగాలు కోల్పోయిన వారికి వేరే అవకాశాలను చూపించడానికి తాము తీవ్రంగా శ్రమిస్తున్నట్టు చెప్పారు. తమను ఉద్యోగం నుంచి తొలగించారని పలువురు మెటా ఉద్యోగులు సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారు. ఈ ఏడాది ప్రారంభంలో మెటా తన రియాల్టీ ల్యాబ్స్ విభాగం ఉద్యోగులను తొలగించింది.

ఇంటెల్‌లో 2 వేల ఉద్యోగులపై వేటు!

ఆగస్టులో ప్రకటించిన ఉద్యోగాల కోతను అమలు చేస్తున్నట్టు ఇంటెల్ సంస్థ తెలిపింది. దీని వల్ల అమెరికా వ్యాప్తంగా 2 వేల మంది ఉద్యోగులపై ప్రభావం పడనుంది. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా శ్రామిక శక్తిని తగ్గిస్తున్నట్టు ఆ సంస్థ తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా 15 వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్టు ఇంటెల్ సీఈవో పాట్ గెల్సింగర్ ఆగస్టులో చేసిన ప్రకటన ప్రకారం భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాల కోతలు ఉండనున్నాయి.

నోకియాలోనూ భారీగా తొలగింపులు

మొబైల్, స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ 'నోకియా' పెద్ద ఎత్తున ఉద్యోగాల కోతకు తెరలేపింది. చైనాలోని వివిధ కార్యాలయాలు, ప్లాంట్లలో పనిచేస్తున్న దాదాపు 2వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించింది. అలాగే, యూరప్‌లో మరో 350 ఉద్యోగాలకు లేఆఫ్ ప్రకటించేందుకు సిద్ధమైంది. కంపెనీ లాభాల మార్జిన్ పెంచుకోవటంపై దృష్టిపెట్టిన 'నోకియా', ఉద్యోగుల జీతభత్యాల భారాన్ని తగ్గించుకునే చర్యల్ని చేపట్టినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇక యూరప్‌లో 350మంది తొలగింపుపై సంప్రదింపులు మొదలయ్యాయని నోకియా అధికార ప్రతినిధి స్వయంగా తెలిపారు. వ్యయ నియంత్రణలో భాగంగా నోకియా గత ఏడాది 14 వేల మంది ఉద్యోగులను తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. మొత్తం ఉద్యోగుల సంఖ్యను 86 వేల నుంచి 72వేలకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

పౌరసత్వ చట్టం సెక్షన్ 6ఏకు సుప్రీం సమర్థన

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: పౌరసత్వ చట్టం సెక్షన్ 6ఏ రాజ్యాంగ బద్ధతను సుప్రీంకోర్టు గురువారం సమర్థించింది. అక్రమ వలసలకు అస్సాం ఒప్పందం ఒక రాజకీయ పరిష్కారమని సీజేఐతో కూడిన అయిదుగురు జడ్జిల ధర్మాసనం తెలిపింది. తీర్పు సందర్భంగా సీజేఐ, మరో ముగ్గురు జడ్జిలు అభిప్రాయాన్ని తెలుపుతూ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అస్సాంలో వలసదారులు ఎక్కువన్నారు. అలాంటి ప్రొవిజన్‌ను చేసే శాసనాధికారం పార్లమెంట్‌కు ఉందన్నారు. 25-3-1971 కటాఫ్ తేదీగా నిర్ణయించడం సరైనదేనన్నారు. జస్టిస్ జేబీ పార్దీవాలా మాత్రం సెక్షన్ 6ఏ రాజ్యాంగ విరుద్ధమని భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. అస్సాం ఒప్పందం కింద పౌరసత్వం పొందేవారి కోసం పౌరసత్వ చట్టంలో సెక్షన్ 6ఏను ప్రత్యేక ప్రొవిజన్‌గా ప్రవేశపెట్టారు. ఈ సెక్షన్ ప్రకారం 1-1-1966 నుంచి 25-3-1971 మధ్యలో అస్సాంకు వలస వచ్చిన వారికి భారత పౌరసత్వం కల్పిస్తారు.

భర్తది నేరమో కాదో త్వరలో నిర్ణయిస్తాం

భార్యకు ఇష్టంలేని శృంగారంపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: భార్యతో బలవంతంగా శృంగారం జరిపే భర్తను శిక్ష నుంచి తప్పిస్తున్న భారత శిక్షా స్మృతి (ఐపీసీ), భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని నిబంధనలకు ఉన్న రాజ్యాంగబద్ధమైన చెల్లుబాటుపై నిర్ణయిస్తామని సుప్రీంకోర్టు గురువారం ప్రకటించింది. భార్య సమ్మతి లేకుండా బలవంతంగా శృంగారం జరిపే భర్తకు శిక్ష విధిస్తే వారి మధ్య సంబంధాలు దెబ్బతింటాయని, వివాహ వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతుందన్న కేంద్ర ప్రభుత్వ వాదనపై సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయాలు కోరింది. ఈ కేసుపై సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ముందుగా పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది కరుణా నంది తన వాదనలు వినిపిస్తూ.. ఐపీసీ, బీఎన్ఎస్‌లోని నిబంధనలను ప్రస్తావించారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. మనముందు రెండు తీర్పులు ఉన్నాయని, వాటిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ముఖ్యంగా ఆ నిబంధనలకున్న రాజ్యాంగబద్ధమైన చెల్లుబాటును పరిశీలించాల్సి ఉందని చెప్పారు. రాజ్యాంగ వ్యతిరేకమైన నిబంధనను కొట్టివేయాలని కరుణా నంది సూచించారు. వివాహంలో బలవంతపు శృంగారం నేరం కాదంటున్న ఐపీసీ, బీఎన్ఎస్‌లోని నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21ని ఉల్లంఘిస్తున్నాయని చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 18 ఏండ్లు నిండిన భార్యపై ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా భర్త జరిపే లైంగిక సంపర్కాన్ని మినహాయించింది కదా అని గుర్తుచేసింది. ఒకవేళ తాము ఆ నిబంధనను కొట్టివేస్తే.. భర్త చేసేది నేరం అవుతుందని, దానిని లైంగిక దాడిగానే పరిగణించాల్సి ఉంటుందని పేర్కొంది. దీనిని ప్రత్యేకమైన నేరంగా పరిగణించాలా లేక ఆ మినహాయింపుకున్న చెల్లుబాటును నిర్ధారించాలా అన్నదానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలిపింది.